బాలసాహితి:

# శర్మజోస్యం

ఏ. వెంకటేశ్వర రెడ్డి

ఒక చిన్న పల్లెటూరిలో కామయ్య శర్మ అను పేరుగల ఒక బ్రాహ్మణు డుండేవాడు. ఆయన అద్భుతంగా జోస్యం చెప్పేవాడని ఆ చుట్టుప్రక్కల పల్లెలలో ప్రతీతి. అనుదినం పల్లెలనుండి తమ సందేహాలను బాపుకోవడంకోసం పల్లె ప్రజలు ఆయనను దర్శించుచుండేవారు. వారిలో ముఖ్యంగా వివాహాదులకు సంబంధించిన ప్రశ్న లడిగేవారు, పశువులు పోయినవారు, ఏదైన సొత్తు పోగొట్టుకొన్నవారు ఎక్కువగా ఉండేవారు. ప్రశ్నకు ఎనిమిదణాలు ఖచ్చితంగా వసూలు చేసేవాడు.

ఇలా ఉండగా ఒక రోజున ఆ ఊరిప్రక్క గ్రామంలో నివసించు 'సుబ్బన్న' అను పేరుగల ఒక చాకలివాని గాడిద ఒకటి కనిపించకుండాపోయింది. చాకలివాడు చుట్టుప్రక్కల ఉండే గ్రామములు, పొలములు, బీళ్లు అన్నీ తిరిగేడు. కనిపించలేదు. శర్మగారివద్ద ప్రశ్న అడగమని బంధువర్గమువారుసలహా యిచ్చారు. కాని ఆ నిరుపేద సుబ్బన్నకు ప్రశ్నకు యిచ్చుకోవడానికి ఎనిమిది అణాలు లేవు. ఇంటిలో వెదకగా చిలుముపట్టియున్న పావులాబిళ్ళ ఒకటి గూటిలో దొరికింది. అది పుచ్చుకొని శర్మగారి దర్శనం చేసికొని విషయం విన్నవించుకొన్నాడు.

శర్మగారు గుడ్లురిమి "ఎనిమిది అణాలకు దమ్మిడీ తక్కువైనా చెప్పేది లేదు వెళ్లిపో" అన్నాడు.

"బీదవాణ్ణి, కనికరించు సామీ! ఈ పావులా పుచ్చుకొని ప్రశ్న చెప్పండి" అని జాలిగా ప్రార్థించేడు పాపం గాడిదను పోగొట్టుకున్న పేదచాకలి సుబ్బన్న.

"ఏం ఉపయోగం లేదు! వెళ్లిపో, అవతలికి!" అని మిగతా కేసులు చూసుకోవడంలో నిమగ్నుడైనాడు కామయ్య శర్మ.

సుబ్బన్న తల దించేసుకొని మెల్లిగా కొంప చేరుకున్నాడు. ముప్పయి రూపాయల గాడిదను చేతులారా ఎలా వదలుకోడం. సుబ్బన్న బాగా ఆలోచించి మూల నుండే కుండలోనున్న జొన్నలు మానెడు ఒక పావులాకు అమ్మి మొత్తం ఎనిమిదణాలతో తిరిగి శర్మగారి దర్శనం చేసుకొన్నాడు.

"మీ ఊరికి సరిగా ఈశాన్య మూల పన్నెండు మైళ్ళ దూరాన వుండే గ్రామములో బందెలదొడ్లో నీ గాడిద ఉన్నది. వెళ్ళి తోలుకొచ్చుకో" అని చూచినట్లుగా చెప్పేడు శర్మ.

సుబ్బన్న ఆనందంతో ఇంటి వద్దకు వచ్చేసరికి పాకలో గాడిద కట్టివేసి ఉన్నది. "అరె! ఇదేమిటి, గాడిద వచ్చేసిందే!" అని సుబ్బన్న ఆశ్చర్యపోతూవుంటే "చాకిరేవుదగ్గరుంటే తోలుకొచ్చా"నని వాని భార్య చెప్పింది. "మరి...అయ్యోరు అలా సెప్పేడేం!" అని ముక్కుమీద వేలేసుకొని అలానే కాసేపు నిలువబడిపోయాడు సుబ్బన్న, ఆ క్షణంలో సుబ్బన్న మెదడులో ఏం ఊహాలు పొడకట్టినాయో గాని— "ఓస్! అంతా బూటకంరా!" అని గట్టిగా అరిచేడు. వెంటనే ఎనిమిదణాల ఫీజువిషయం జ్ఞప్తికొచ్చింది. పేద సుబ్బన్న కడుపు దహించుకపోయింది. "వృథాగా చేతిలోని పైకం ఆయనవాత కొట్టేను" అంటూ దిగులుగా కూర్చున్నాడు క్రింద. వానిలో ప్రతీకారవాంఛ రేకెత్తడం మొదలుపెట్టింది.

అర్థరాత్రి సమయం. నలుమూలల చిమ్మచీకటి ఆవరించిఉంది. చాకలి సుబ్బన్న శర్మగారి దొడ్డి వాకిలి తెరచి పాకలో ప్రవేశించాడు.

ఆవు గడ్డి నములుతూ వుంది.

ప్రక్కనే నేలపై చాపవేసికొని శర్మగారి సేవకుడు చెవిటి పుల్లయ్య గుర్రుపెట్టి నిద్రపోతూ ఉన్నాడు. సుబ్బన్న ఆవు పలుపు విప్పి చేత పుచ్చుకొని బయటికి నడిచేడు. ఒక నిముషంలో తిరిగి లోనికి వచ్చి చెవిటి పుల్లయ్యను జాగ్రత్తగా చాపతోపాటు ఎత్తి ఆవు ఉన్న స్థానంలో ఉంచేడు. త్రాటితో గాటిగుంజకు దాని మెడను కట్టివేసి మెల్లిగా వచ్చిన దారినే వెళ్లిపోయాడు.

వేకువఝామున్నే శర్మ నిద్రనుంచి లేచి అలవాటుప్రకారం "పుల్లిగా!" అంటూ వాడిని నిద్ర లేపడంకోసరం పాకలోకి వచ్చాడు. చీకటిలో బాగా కనుపించలేదు. బయటికి వెళ్ళేడేమోనని అనుకొని దంటు పుచ్చుకొని ఆవుని అదలించాడు. "ఊఁ" అంటూ ముసుగుదన్ని పరుండిఉన్న పుల్లయ్య అటునుండి యిటు పొర్లేడు. శర్మగారి గుండె గభేలుమన్నది.

"ఇక్కడ పడుకున్నావేంరా వెధవా! ఆవేది?"

"ఆఁ" అంటూ మళ్ళీ పొర్లేడు.

"ఆఁ ఊఁ ఏమిట్రా గాడిదీ! ఆవు ఏలా పోయిందీ? లేయ్!" అంటూ దంటుతో ఒకటి పీకేసరికి లేవబోయాడు. మెడకు తగిలించిన త్రాడు బిగిసిపోయింది. "అమ్మ య్యో!" అని అరిచేడు.

"ఇదేమిట్రా గాడిదీ! గుంజకు కట్టేసిం దెవరు?" అంటూ అది విప్పి—"ఆవు ఎలా పోయిందీ?—ఇదంతా ఏమిటి?" అని గట్టిగా అరిచేడు శర్మ.

"ఆవేదీ?" అంటూ అప్పుడు అటూ యిటూ చూడ్డం మొదలుపెట్టేడు వెర్రిపుల్లయ్య.

"ఇంకా ఆవేమిటిరా గాడిదీ! మోసం జరిగిపోయింది. దొంగలు తోలుకొనిపోయారల్లే ఉంది!" అన్నాడు శర్మ.

"అమ్మో దొంగలా!" అంటూ అటూ యిటూ పరుగెత్తడం ప్రారంభించేడు పుల్లయ్య.

"నీ మొఖం! దొంగలిప్పు డెక్కడుంటార్రా వెధవా! ఆవును తోలుకొని వెళ్ళిపోతూరు!" అన్నాడు దిగులుగా. ఇంతలో శర్మగారి భార్యకూడా లేచివచ్చింది. విషయమంతా విని- "అయితే ప్రశ్న వేసి చూడండి! ఎవరు తోలుకెళ్ళారో తెలిసిపోతుంది! మన చేతిలో పని! దిగులుపడ్డం దేనికి?" అంది.

"ప్రశ్నా, నా మొఖం!...ఎవడో బాగా కనిపెట్టి పనిచేసేశాడు!" అంటూ తలపట్టుకొనికూచున్నాడు.

మరునాటినుండి శర్మ ప్రశ్నలు చెప్పడం బొత్తిగా మానివేసి వ్యవసాయం వృత్తిగా ప్రారంభించాడు. ఎవరైనా ప్రశ్నకు వస్తే—"దానికి సంబంధించిన తాటియాకుల గ్రంథాన్ని ఎవరో దొంగవెధవ లపహరించివేశారండీ! అంచేత అది మానుకున్నాను" అని సమాధానం చెప్పి పంపించేవాడు. ★





మా రోగుల సౌకర్యార్థం, మా డాక్టరును సంప్రదింపులకు ప్రతినెల నిర్ణీత తేదీలలో క్రింద పేర్కొన్న ఆయా ప్రదేశాలలో ఆయా తేదీలలో కలుసుకోవచ్చును. ప్రతిచోట సంప్రదింపుల వేళలు: ఉ॥ 9 గం॥ నుండి 11 గం॥ వరకు సా॥ 3 గం॥ నుండి 5 గం॥ వరకు మాత్రమే.

నెల్లూరు 6 (సాయంత్రం) సి. ఆర్. గోపాల్ బ్రదర్స్, కెమిస్టులు, ట్రంక్ రోడ్డు.
సికిందరాబాదు 8 (ఉదయం) డి. జె. పరేక్ & కో, కెమిస్టులు, జుమ్మామసీదు.
హైదరాబాదు 9 (ఉదయం) డి. జె. పరేక్ & కో, కెమిస్టులు, రెసిడెన్సీరోడ్డు.
తెనాలి 12 (ఉదయం) కన్యకా పరమేశ్వరీ సత్రము.
గుంటూరు 14 (ఉదయం) మెడికల్ స్టోర్సు, కొత్తపేట.
మచిలీపట్టణం 16 (ఉదయం) ఆనంద ఫార్మసీ, కెమిస్టులు, మెయిన్‌రోడ్.
రాజమండ్రి 19 (ఉదయం) ఈశ్వర్‌దాస్ & కో, మెయిన్‌రోడ్డు.
భీమవరం 20 (ఉదయం) ప్రసాద్ సన్సు & కో, కెమిస్టులు.
జమ్‌షెడ్‌పూర్ 1 వ (ఏప్రిల్ 56) ఆంధ్ర జెనెటిక్, లిటరరీసొసైటీ, సాక్షి.
ఖరగ్‌పూర్ 4 వ తేదీ యునైటెడ్ మెడికల్ స్టోర్సు కెమిస్టులు, డ్రగ్గిస్టులు, రైల్వే మార్కెట్.

జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్సు,
హెడ్డాఫీసు: మదరాసు.
బ్రాంచీలు:

| | | |
|---|---|---|
| ఒరుగంటివారివీధి, విజయనగరం సిటీ | 132/1 హారిసన్‌రోడ్, కలకత్తా | వాడంకివారివీధి, లీలామహల్‌వద్ద, గవర్నరుపేట, విజయవాడ. |